జీవాతువు

శ్రీమతి ఆర్. వసుంధర

జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ రామచంద్రయ్యగారు అర్జెంటుగా చూడవలసిన ఆఫీసు కాగితాలు చూడటం పూర్తయింది. సంతకాలు పెట్టిన కాగితాలు తీసుకెళ్ళి స్క్రీనుకు అవతలగా 'ఆఫీసు'లో కూర్చున్నాడు పెద్దగుమాస్తా. ప్యూను జకరయ్య వాకిట్లో నిలుచుని ఎవరితోనో మెల్లగా మాట్లాడుతున్నాడు: శేషయ్య ఎటెండెన్సురిజిష్టరు పట్టుకుని క్లాసుల్లో కెళ్ళాడు. స్వీపరు చెంచురాముడు వరండాలో ఊడుస్తుంటే చీపురు బరబరా శబ్దంచేస్తున్నది. జరుగుతున్న క్లాసుల్లోంచి సన్నగా రణగొణధ్వని వినబడుతున్నది. లెక్చరర్లను వెయ్యనందున సగంక్లాసులు జరగటమేలేదు. చదవ్వలసిన పాఠాలు రెట్టింపుచేసి, చెప్పవలసిన లెక్చరర్లను వెయ్యకుండావుంటే మేము ఏమైపోవాలని విద్యార్థులు గోలపెడుతున్నారు. కాలేజికి రాకుండా స్ట్రైక్‌చేస్తామనిఅన్నారుగాని ఇంకా అది ప్రారంభంకాలేదు.

ఈ దినం పోస్టు తక్కువగా ఉన్నది. అందులో టైపిస్టు సెలవులో ఉన్నాడు. ఇహ ఆ ఇంటర్వ్యూలు అయిపోతే తతిమ్మాపని ఏమంతగాలేదు. శీనయ్యను వూస్ట్‌చేసినపని తాలూకు ఖాళీ భర్తీచెయ్యడానికి ఇంటర్వ్యూలు పదినిముషాల్లో ప్రారంభం అవుతాయి.

రామచంద్రయ్యగారికి ఒంట్లో సుఖంగాలేదు. కడుపులో తిప్పినట్లుగా ఉన్నది. ఒకటే తలనొప్పి. చాలా చీకాగ్గా కోపంగా ఉన్నారు. 'వెధవకి పొగరు తలకెక్కింది. ఆకాశరామన్న పేరుతో అయితేమాత్రం అన్నిబూతులు తిడతాడా! పని దొరికేవరకూ ఒక ఏడుపు: దొరికినతర్వాత ఇంకో ఏడుపు. తృప్తిఅనేది ఎక్కడుంది?' అనుకున్నారు. డ్రాయరు సొరుగులోంచి భావన అల్లంపొట్లంతీసి రెండు పలుకులు నోట్లో వేసుకున్నారు. 'వీళ్ళుచేస్తున్న చిన్నతప్పులు పట్టించుకోకుండా ఒదిలేస్తున్నందుకు వాడికి కళ్ళు నెత్తిమీదకొచ్చినై. అదేదో సామెత చెప్పినట్లు రౌతు మెత్తనైతే గుర్రం ఏవిటోచేసిందట...ఆయినా ఈ దేవుడు ఉత్తమతిలేనివాడు. మంచివాడికి కష్టంపెడతాడు. చెడ్డవాడికి జయం ఇస్తాడు. ఏమి న్యాయం! ఈ సమస్తసృష్టికీ తాను బాధ్యుడై ఉండీకూడా ఇంకా అస్తవ్యస్తాలను యిలా కొనసాగనిస్తున్నాడంటే మతివుండేవాడైతే అన్నీ ఒకక్రమంలోపెట్టి చక్కగా నిర్వహించుకోడూ?' అనుకున్నారు. ఆయనకు చీకాకు కలిగినప్పుడు యిట్లాగ దేవుణ్ణి కోప్పడ్డం ఒక అలవాటు.

అయినదానికీ కానిదానికీ దేవుణ్ణి తలుచుకోవటం ఆయనతాత రామచంద్రయ్యగారినుండీ వారిమీది గౌరవంకొద్దీ సంక్రమించిన అలవాటు. కాని తాతగారికీ మనవడికీ మాట తీరులో సామ్యమేగాని ఆలోచనల తీరులో పెద్దభేదం ఉన్నది. తాత రామచంద్రయ్యగారికి దేవుడిమీద ఎంత నమ్మకం ఉన్నదో తప్పొప్పులమీదా అంత నమ్మకం ఉన్నది. ఏది మంచో ఏది చెడ్డో ఖచ్చితంగా తెలుసు. త్రికరణ శుద్ధితో 'మంచి'గా ఉంటూ సుఖంగా తృప్తిగా బ్రతికారు. ప్రిన్సిపాలు రామచంద్రయ్యగారు తాతగారిలాగా 'మంచి'గానే ఉంటున్నారు. కాని దేవుణ్ణి గురించిన స్థిరమైన నమ్మకం ఏమీ లేదు. అనుకోవలసి వచ్చినప్పుడు 'కలడు కలండనెడివాడు కలడో లేడో' అనుకుంటారు. 'తప్పు' అన్నా 'ఒప్పు' అన్నా నిర్వచనం తెలియటం లేదు. బాహ్యపరిస్థితులమీద ఆధారపడి నిర్ణయించిన 'మంచి' 'చెడ్డ'ల్లో నమ్మకం లేదు. అంతా చాల కలగా పులగం వ్యవహారంగా

ఉన్నది. కాని తనకు కావలసిందేమిటో ఆయనకు తెలుసు. అది జీవితంలో ఆనందం, జీవించడంలో తృప్తి. నిండు మనసు ప్రసాదించే తృప్తి. అదే ఆయనకు ఎక్కడా కనిపించకుండా ఉన్నది.

ఇంతవరకూ ఆయన ఎన్నో పట్టణాలే చూశారు. మానవ జీవితం ఎన్నో శతాబ్దాలుగా సంతరించుకుంటూ వస్తున్న నాగరకత ఎన్నో అనర్థాలను కూడా తెచ్చిపెట్టిందని ఆయన నమ్మకం. అందులో ముఖ్యమైనది మనిషికి తనవైన 'విలువలు' లేకపోవటం. మనిషి మూకమీద ఆలోచించటం అలవాటు చేసుకొని, అందులో తాను ఎవరో, తనకు కావలసినదేమిటో గుర్తించుకోలేకుండా ఉన్నాడు. జీవితానికి అర్థం గోచరించటం లేదు......

రామచంద్రయ్యగారు మొదట్లో ఈ ఊరికి వచ్చినప్పుడు ఏమిటేమిటో అనుకున్నారు. పల్లెల్లో కనిపించే పచ్చదనం, వైశాల్యం ఆయనకు ఆనందం కలిగించింది. ప్రకృతిమాత ఒడిలో పెరిగే యీ మనుష్యులు జీవన సౌభాగ్యానికీ జీవిత రహస్యానికీ దగ్గరగా ఉంటారనుకున్నారు...కాని ఇక్కడ మనుష్యులూ ఆయన ఊహించినట్లుగా లేరు. ఇక్కడా తెలివి మీరిపోయి అసంతృప్తితో సతమతమౌతున్న వాళ్లే కనిపించారు...ఈ ఊరి నీళ్లు ఆయనకు సరిపడలేదు. ఊరికే పైత్యం చేస్తున్నది. ఒకసారి బాగుంటే ఒకసారి బాగుండటం లేదు ... అందులో ఈ శీనయ్య గొడవ ఒకటి......

ఇంటర్వ్యూకి పిలిచిన వాళ్ల లిస్టు చూసుకున్నారు. పదిమంది మెకానిక్కులు...ఒక్క జవాను పనికోసం! కాలేజీ బావి మోటారు చూచుకోడానికీ, గాస్‌రూమ్‌లో సహాయానికీ పనికొస్తాడని 'మోటారు మెకానిజం తెలిసుంటే బాగుంటుంది' అని వ్రాశారు ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజికి. ఫలితంగా ఈ పది పేర్లు పంపారు. అందరూ అంతో యింతో మెకానిజం తెలుసుకొని పనిచేసుకుంటున్న వాళ్లే. ఉద్యోగం యిచ్చే స్థిరత్వంకోసం చేస్తున్న పనిని వదులుకొని ఈ పనిలోకి రావాలని ఆశిస్తున్నారు......

అదెక్కడో ఒవానుపనికోసం డిగ్రీలు పుచ్చుకున్న వాళ్లుకూడా ఎగబడుతున్నట్లు చదివిన వార్త నిజమే అయ్యుంటుంది. 'సుబ్బన్నా ఆ ఫైలు ఇలా యివ్వు' 'రామయ్యా; ఈ కాగితం వాళ్లకు చూపించిరా' 'కాఫీ పట్టుకురా' 'గంటకొట్టు'—ఈ పనులు చేస్తుండటమే పరమార్థమనీ నూటఇరవై రూపాయిలే మహాప్రసాదమనీ భావిస్తారా వాళ్లు! మనసుకు నచ్చినపనిని నేర్చుకుని, ఇష్టంగా పనిచేసుకుంటూ, కోరుకున్న జీవితం గడపటంఅనేది సామాన్యుడికి లభిస్తుందా? ఈ దేశానికి మోక్షం కలుగుతుందా? అని నిట్టూర్చారు రామచంద్రయ్యగారు.

ఇంటర్వ్యూ ప్రారంభం అయింది. పదిమందిని పిలిస్తే అయిదుగురే వచ్చారుట. పల్లెటూరని కాబోలు! దేవుడిచ్చిన గాలీ, వెలుతురూ, భూమీ, ఆకాశమూ మీదకంటే మనిషి తయారుచేసుకున్న సౌకర్యాలమీనా. నాగరకతమీదా మోజు ప్రజలకు...మొదటి కాండిడేట్ రవణయ్య. ఎక్కడో ట్రాక్టర్‌డ్రైవర్‌గా ఉంటున్నాడు. ఎట్లైనా గవర్నమెంటు ఉద్యోగం అంటే గట్టికనుక ఇందులోకి ఒస్తాడట. ఉదయమే ఇంటిదగ్గర హాజరై ఒక స్థానికరాజకీయనాయకుడి దగ్గర్నుండీ తెచ్చిన రికమెండేషన్‌లెటరు ఇచ్చాడు. అంతటి నాయకుడు తనకు ముఖాముఖీ తెలుసునన్న శీవిని చిందిస్తూ నిలుచున్నాడు. వీడి ధీమా వీడూ ఇంకో శీనయ్య అయ్యేట్లున్నాడు! అనుకున్నారు... కాని శీనయ్య మొదట ఒచ్చినప్పుడు తలకు గుడ్డ చుట్టుకుని చేతులు కట్టుకుని వెర్రిమొహం వేసుకుని చిరిగినపాంటుతో ఒచ్చాడు. ఇరవైయేళ్ల కుర్రాడు.

'అయ్యగార్ని జూత్తే నోట్టో మాటరాదు. నంగిపలుకులు బలుకుతడు. ఎదవ పొగురుబలిసి ఉండేపని పోంగొట్టుకున్నడుగాని సూత్తుంటు ఆడి కర్మ ఆడే అనుబగిత్తడు. పనిదొరక్క మలమల మాడతడు. ఆడేంజెయ్యకపోతే అయ్యగారు ఎందుకు తీసేత్తారు! బువ్వపెట్టినోళ్లకి దణ్ణంపెట్టాలి... ఆడివాచీ, ఆడి సెప్పులూ, టూడెంటుమాదిరి ఆడి

ఏషికం...ఏందో సేసుంటడు...ఆటపిచ్చిగాడు. జీతం డబ్బులన్నీ ఆటలో తగలేత్తాడు. ఆడిబాబు డబ్బులో అని గోల...ఒచ్చినప్పుడు ఎంతబయుంగ ఒచ్చిండు! ఈడకొచ్చి పేంటు చించుకుని పేరుపిలవంగనే గబాల్న తలగుడ్డ సుట్టేసి ఆముట్న లోపలికి బోయిండు... జమానంటే ఇట్టుండాలి అనిపించినడు'—వాకిట్లో వుండే ఆఫీసు ప్యూను జకరయ్యతో స్వీపరు చెంచురాముడు చెప్తావున్నాడు నిన్నటిరోజు మధ్యాహ్నం.

జకరయ్య నోట్లో నాలుక లేనట్లుంటాడు గనుకనూ, తనకన్నా ఆలస్యంగా పనిలో జేరాడు గనుకనూ తన స్వగతాలన్నీ జకరయ్యదగ్గరే చెప్పుకుంటాడు చెంచురాముడు, తీరికున్నప్పుడు. వాడి పద్దెనిమిదేళ్ల గొంతు ఖంగుమని పలుకుతుంది. ఉర్దింపునీ ఆజ్ఞనీ ఏడుపునీ నవ్వునీ అన్నింటినీ ఒకే విధంగా ధీమాతో ధైర్యంతో స్థైర్యంతో వెలువరించే గొంతు అది. బాల్యంనుంచీ పురుషత్వంలోనికి ఒరుగుతున్నది. ఏరు పారుతున్నట్లు గలగలా పరుగులెత్తుతూ వుంటుంది వాడి వాక్ప్రవాహం. రోజూ ఏదో ఒక సమయంలో బయటినుండీ విన్పించే వాడి ఉపన్యాసాలు వినటం రామచంద్రయ్యగారికి అలవాటై పోయింది. నీకు ఏడవటంకూడా నవ్వుతూనే ఏడుస్తాడేమో! అనుకుని నవ్వుకుంటుంటారు.

శీనయ్యను పనిలోనుంచీ తీసేసిన మూడు రోజులకు ఆశతో మెరిసే కళ్లతో, భయం భయంగా నవ్వుతూ, నస్యటానికి ప్రయత్నిస్తూ ఆఫీసులోనికొచ్చాడు చెంచురాముడు. తనకు ప్రమోషన్ కావాలట. శీనయ్య పని తన కిప్పియ్యాలట. కాళ్లు పట్టుకుంటాడట. ఏ పని జెప్పినా బయంగా జాగ్రత్తగా జేసుకుంటాడట. 'ఎంప్లాయ్‌మెంటు ఆఫీసు మంచీ నీ పేరొస్తేగాని నేనేమీ చెయ్యలేను. ఒస్తే చూద్దాంలే' అన్నారు అప్పుడు. 'యిచ్చేవోళ్లు... తమ దయ' అని దణ్ణంపెట్టి వెళ్లాడు. వాడి పేరు లిస్టులో రాలేదు...

కిటికీలోంచి కనబడుతుంది 'కాలేజీ తోట'. తోటమాలిని పెట్టడానికి గవర్నమెంటు వారికి డబ్బు చాలదు కనుక చెంచురాముడే తోటపనీ చూసుకోవాలి. బాటనీ లెక్చరరు అవసరం అని తెచ్చిపెట్టిన మొక్కల్ని ఖూని చెయ్యడం, తనకు మంచివని తోచిన నాలుగు మొక్కలకు నీళ్లు పెట్టడం తోటమాలిగా చెంచురాముడు నిర్వర్తిస్తున్న బాధ్యతలు. బాటనీ డిపార్టుమెంటునుంచీ వాడిమీద వారానికో ఫిర్యాదు వస్తుంది...ఊరికే అనవసరంగా తనను బాధపెట్టటానికే బాటనోళ్లు పిచ్చి మొక్కలన్నీ తెచ్చిపెడుతున్నారని చెంచురాముడు జకరయ్యతో అంటుంటాడు...తోటనడిమధ్యన ఒక బాదంచెట్టు కొమ్మలు బారలు చాచుకుంటూ పైకెగిరి పోతున్నది. ఒక మూలన నాలుగు బొప్పాయి మొక్కలు స్తంభాల్లా పైకి లేచాయి. వనమహోత్సవంనాటి వేపమొక్కా గులాబీ మొక్కలు రెండూ బ్రతికి బట్టగట్టాలో ఒద్దో ఇంకా నిశ్చయించుకోలేదు. మూడు లిల్లీ మొక్కలు సగం ఎండి నేలకొరిగి కునికిపాట్లు పడుతున్నాయి. తొట్లలో పెట్టిన అరడజను క్రోటను మొక్కలూ, ఒక ముద్దమందార, ఒక వరుసలో పది మెట్టతామరలూ—అదీ కాలేజితోట. పనిలేనప్పుడంతా రామచంద్రయ్యగారి కళ్లు తోటవేపు తిరిగి పోతుంటాయి. ఆ పచ్చదనంతో ఆయనకేదో తాదాత్మ్యం...ఇవ్వాళ కిటికీలోంచి చూసిన ఆయన కళ్లకు పాదులనిండా దట్టంగా పెరిగిపోయిన కలుపుమొక్కలు కనిపించాయి. 'అరె, కలుపుతియ్యడం లేదే...చెంచురాముడితో చెప్పాలి. అసలు మొక్కలకంటె కలుపు మొక్కలు జోరుగా ఉన్నాయి......అన్నిటికీ ఒకే భూమి, ఒకే నీరు, ఒకే గాలి, ఒకే ఆకాశం! ప్చ్...' అనుకున్నారు.

క్రితంరోజు ఉదయం యీ ఉద్యోగకోసమే యీ ఊరివాడే వెంకయ్య అనే మనిషి ఒచ్చాడు. అతనికి ఇంటర్వ్యూ కార్డు రాలేదట. కాని అయ్యగారు మంచి వాళ్లనీ, మనుషుల కష్టం సుఖం గమనిస్తారనీ వినీ తన సంగతి చెప్పుకుందామని ఒచ్చాడట. 'బాబూ, నాకు పెళ్లాం, ముగ్గురు బిడ్డలూ, ముసలితల్లీ వున్నారు.

ఒక్కడే కష్టంమీద బతకలేకుండా వున్నాం. రెండేళ్ల కింద రిజిష్టరు జేయించుకున్నాను యంప్లాయ్ మెంటు ఆఫీసులో...ఏమని చెప్పుకునేది, బాబూ. ఈ నడిమద్దెల్లో ఒకతడవ ఇంటర్వ్యూ కొస్తేగూడ యీడ పనిలో వున్న శేషయ్య నా నోట దుమ్ము కొట్టాడు బాబూ...ఇంటర్వ్యూకార్డు రాకుండా జేశాడు' అని చెప్పుకున్నాడు. రామచంద్రయ్యగారికి ఆశ్చర్యం కలిగింది. ఈ మనిషి తెలిసీ తెలియని అభియోగాలు చేస్తున్నాడు అనుకున్నారు. శేషయ్య అనే జవాను కాలేజిలో ఉండే మాట నిజమే కాని ఇంటర్వ్యూకార్డుకీ శేషయ్యకీ ఏమీ సంబంధంలేదు. 'మీకు కార్డులు ఆఫీసువాళ్లు పోస్టులో పంపిస్తారు. శేషయ్యకేమీ సంబంధంలేదు. ఊరికే లేనిపోనిమాటలు చెప్పవద్దు' అని మందలించారు వెంకయ్యకు ఆవేశంతో మొహం ఎర్రబడ్డది. చేత్తో మొహం తుడుచుకున్నాడు. 'బాబూ, ఆ శేషయ్య సంగతి మీకు బాగా తెలవదు. ఒట్టి.. వాడి అన్న పోష్టు జమానుగా వున్నాడు. మాకూ వాళ్ళకీ గోడతగాదా, అన్నాదమ్ముళ్లిద్దరూ కూడబలుక్కొని యీ పని జేశారు...' ఇంతదాకా చెప్పినాక వెంకయ్యకళ్లల్లో అర్ధింపుపోయి ఒక తెలివి మెరిసింది. 'ఈ చుట్టుపక్కల్లో యే ఆఫీసులో కన్నా ఉద్యోగం కాళీపడగానే వాడి అన్న అందరిదగ్గరా తలో యాభై రూపాయిలు పుచ్చుకుని తీసుకెళ్లి యంప్లాయ్‌మెంటు ఆఫీసులో యిచ్చి వాళ్ల పేరు లిష్టులో ఏపిస్తాడు. మాబోటోళ్లకు దిక్కులేకుండా వుంది, బాబూ...అంతే గాకుండా సెలవల్లో బ్రిడ్జికాడ కూర్చొని 'ఆఫీసులో అయ్యగారు నే నెట్టజెప్తె అట్టజేస్తాడు. ఈ ఎంకడికి పనిరానియ్యను ఒస్తె నా ఉత్స నే దాగుతా' అని పెతిజ్ఞగూడ జేశాడు బాబూ' అన్నాడు. శేషయ్య సంగతి వాళ్లపై ఆఫీసరుకు బాగా చెప్పేశానన్న విజయగర్వం వెంకయ్యలో పొంగి యింకొంచెం నిటారుగా నిలుచున్నాడు. ఇప్పుడేమంటారన్నట్లు చూశాడు. 'లిస్టులో పేరురానిది నేనేమీ చెయ్యలేను' అని వెంకయ్యను పంపించేశారు.

'శేషయ్యని జూసి బయపడత రెందయ్యా. యేంది, అయిదు నిమిషాలు ఆలీసెంగొత్తే అయ్యగారు తలదీత్తారా, ఏందీ అని...నివ్వు ఆ శీనయ్య యిద్దరి కిద్దరూ ఆయనకి రోజా కాఫీలూ టిపినీలు బలేగ మేపుతుండరు. ఇంకా కుంటోడికో గుడ్డోడికో బిచ్చగాడికో యీయాదా...నన్నుమాత్తరం బతకనిత్తన్నడా ఆయన. వూరికూరికెనే నామింద పెత్తనం జేత్తడు. నివ్వు కంటింజెన్సోడివి. అయ్యగారు యిద్ద్యాల బొమ్మంటే బోవాల్సిందె' అంటడు. ఆయన కేవా!...అయ్యగారికి నీమింద జెవత, నీమింద జెవత అని ఆయన బెదిరిచ్చనూ, మీరు మేపనూ...' చెంచురాముడు జకరయ్యని మందలించడం వినబడించి ఒక రోజున.

శీనయ్య జకరయ్యలదగ్గర ఈ మర్యాదలన్నీ జరిపించుకుంటూనే, ప్రిన్సిపాలుగారిదగ్గరకొచ్చి 'వాళ్ల మీద కావలసినప్పుడు ఏదన్నా రిపోర్టు రాసిమ్మంటే కాగితంమీద రాపిస్తాన'ని మనవిజేసుకున్నాడు శేషయ్య. 'నేటి రాజకీయాల్లో ప్రవేశిస్తే బాగా రాణించి ఉండేవాడు' అనుకున్నారు రామచంద్రయ్యగారు.

మొదట ఆకాశరామన్న ఉత్తరం చూడగానే ఇటువంటిపనిచేసేవాడు శేషయ్యే అనుకున్నారు. వ్రాత పరిచితమైనదిగా తోచింది. నెమ్మదిగా జ్ఞాపకం తెచ్చుకున్నమీదట అది శీనయ్య వ్రాతగా పోల్చుకున్నారు. నాలుగునెల్లక్రితం సెలవల్లో శీనయ్య వ్రాసిన ఉత్తరం బయటికితీశారు.

'మహారాజరాజశ్రీ అయ్యగారి దివ్యసమ్ముఖమునకు శీనయ్య అనేకనమస్కారములు. మీరు నాకు దయతో ఉద్యోగం యిచ్చివున్నారు. చాలా విషయాల్లో మీరే తండ్రీ దైవమూగా ఆదరించియున్నారు. ఇప్పుడు నేను పెళ్లిచేసుకోబోతున్నాను. మీరు దయతో ఆశీర్వదించగోర్తాను. సెలవు అయిపోగానే తమవద్ద హాజరు పడగలను.

ఇట్లు
విధేయుడు
శీనయ్య'

ఏమాత్రం సందేహంలేకుండా సరిగ్గా యిదే వ్రాతలో వచ్చింది ఆకాశరామన్న ఉత్తరం. అది

తలపుకురాగానే రామచంద్రయ్యగారికి చీకాకు కలిగింది. తలనొప్పి వచ్చింది. మరికొంచెం భావసల్లం నోట్లో వేసుకున్నారు. నొసలు చిట్లించి 'ఈసారి యిలాంటివాడికి ఉద్యోగం యివ్వకూడదు ఒకడిని చూసి ఇంకోడు చెడతాడు. డిసిప్లిన్ పోతుంది' అనుకున్నారు.

నాలుగో కాండిడేటు ఒచ్చాడు. ఈ పని తనకు యివ్వకుంటే ఆత్మహత్య చేసుకోవాల్సిందే, వేరు దిక్కులేదుఅంటూ తన కష్టాలన్నీ ఏకరువు పెట్టుకున్నాడు. మనిషి కష్టంలో ఉన్నట్లే కనిపిస్తున్నాడు. కాని కన్పించే తీరూ, చెప్పేమాటలూ. ఆఖరికి వాళ్ల కష్టమూకూడా చూచి ఉద్యోగం యివ్వటానికి వీల్లేదు. బుద్ధి వక్రంగాఉండే శీనయ్య ఎంత వినయవంతుడుగా కనిపించాడు! వాడికీ వేరు ఆధారం లేదు. తల్లినీ తండ్రినీ పోషించాలి. రెండేళ్లలో నాలుగు టెంపరరీ ఉద్యోగాలు మారాననీ, ఎట్లైనా యిక్కడ నిలకడగా ఉండే ఉద్యోగం యిమ్మనీ ప్రాధేయపడ్డాడు...జకరయ్య ఇంటర్వ్యూకి ఒచ్చినప్పుడు దీనంగా, అర్ధప్రాణంతో, ఫాల్గుణమాసానికి చెమటకంపుకొడుతూ, మాసినబట్టల్తో ఒచ్చాడు. ఏదో మొక్కుబడి తీర్చుకుంటున్నట్లు ఒచ్చాడుగాని మనిషిలో ఆశ, చలనం అన్నవి కన్పించలేదు. మనిషి అన్నవాడు అంత నిర్జీవంగా నిస్పృహతో ఉండటం రామచంద్రయ్యగారికి చాలా కోపం తెప్పించింది. డబ్బు లేకపోవచ్చుగాని ఉండే బట్టలు ఊరి బయటి చెరువులో ఉతుక్కోడానికి అడ్డమేమిటి?' అని ఉరిమారు. రోగిష్టి పెళ్లాన్నీ ముసలి తల్లినీ తన ఒక్కడి కూలికష్టంమీద పోషించలేక ఎంత శ్రమపడ్డా కడుపునిండక అర్ధాకలితో పస్తులుంటూ విసుగుబుట్టి రెండుసార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేశాట్ట యింతకుముందు. ఈ విషయం వాళ్ల ఊరి మేష్టారు చెప్పారు తరువాత. ఉద్యోగంలో స్థిరపడ్డానన్న నమ్మకం ఏర్పడ్డాక యీ సంవత్సరంలో రెట్టింపు లావెక్కాడు జకరయ్య.

అందరికీ అంత అవసరం అనిపిస్తున్న ఉద్యోగాన్ని నిర్లక్ష్యంగా పోగొట్టుకున్నాడు శీనయ్య. ఒక రోజున గాభరాగా ఒచ్చి 'మా వూళ్లో మా అన్నకి ఒంట్లో బాగాలేదు. ఆస్పత్రిలో జేర్చాలి. రెండు రోజులు సెలవు కావాలి' అన్నాడు ఏడుపు మొహంతో. 'నీకు సొంత అన్నా?' శీనయ్యకు అన్నలు లేరు. 'కాదుసార్...మా చిన్నమ్మ కొడుకు. వాళ్లకు ఏమీ తెలీదుసార్. నేనుపోయి చెయ్యాల. వారం రోజులనుంచీ నూట ఆరు జెరం' అన్నాడు. మాటలు కష్టంగా చాల ప్రయత్నంమీద పెగిలి ఒస్తున్నాయి...శీనయ్య ఆయనతో ఎప్పుడు మాట్లాడినా అంతే. చాలా భయస్తుడు. శీనయ్యకు ఎప్పుడు సెలవు కావాలన్నా వాడికో వాళ్లవాళ్లకో నూట ఆరు డిగ్రీల జ్వరం ఒచ్చి వుంటుంది. మొదటిసారి ఆ జ్వరం విషయం విన్నప్పుడు 'డాక్టరుకు చూపించావా? ఏం జ్వరం?' అనడిగారు రామచంద్రయ్యగారు. డాక్టర్ను చూసి చూసి కనుక్కోలేకుండా పోతున్న ఆ జ్వరం సంగతి రెండుసార్లు విన్నాక యిహ అడగటం మానేశారు... 'ప్రక్క ఊరేకదా మీది. ఒక్కరోజు సెలవు తీసుకుని ఆస్పత్రిలో చేర్పిరా' అన్నారు. తరువాత రెండు రోజులకు ఒచ్చింది ఆకాశరామన్న ఉత్తరం. చూడగానే నక్సలైట్ ఉత్తరం కాబోలనుకున్నారు. ఇన్నాళ్లూ పెద్ద భూస్వాముల్నీ వడ్డీ వ్యాపారుల్నీ రూపుమాపాలని వేసుకున్న పథకం మార్చుకుని, గవర్నమెంటు ఉద్యోగస్తుల్ని నశింప జెయ్యాలన్న ప్రణాళిక రూపొందించుకున్నారా వాళ్లు? అన్న అనుమానంకూడా ఒచ్చింది.

'ఏమిరా ప్రిన్సిపాల్,

నీకు పొయ్యేకాలం దాపరించింది. జవాన్లకు సెలవ లివ్వకుండా ఏడిపిస్తున్నావా దొంగ ముండాకొడకా. నీకు యింటిముందూ కాలేజీలో నీ గది దగ్గరా జవాను కూర్చోని వుండటం ముఖ్యమైందా? నీ పెళ్లాం దొంగముండ. దానికి బజారునుంచీ కూరగాయలు తెచ్చియ్యాలా! నీ పాపం పండుతా వుంది. వారం రోజులు టైమిస్తున్నాం. జవాన్ల డ్యూటీలు తీసేసి వాళ్లడిగిన సెలవలిస్తూ గౌరవంగా చూడకపోతే నీ అంతం చూస్తాం. మీ

అందరి ప్రాణాలు తీస్తాం. పేపర్లలో నీ మీద బూతులు రాయిస్తాం. జాగ్రత్త.

లేబరు కమిటీ'

ఊస్టింగ్ ఆర్డరు చేతబట్టుకుని పోతున్న శీనయ్యను వరండాలో పలకరించాడు చెంచురాముడు ఉత్సాహంగా. 'ఏవయ్యా శీనయ్య, అయ్యగార్ని రెండ్రోజులు సెలవడిగి శనాదివారాలు గలుపుకొని నాల్రోజులు అత్తారింటికి పొయ్యొస్తనంటివి. ఎల్లొచ్చావా' అంటూ.

ఇంటర్వ్యూలు అయిపోయాయి. అయిదుగురు అభ్యర్థులూ అయిదు రకాలుగా ఉద్యోగాన్నర్థించారు. ఆ ఉద్యోగం వాళ్ల కుటుంబాలకు మూడు పూటలూ తిండిపెట్టే వరం. అందరి మొహాల్లోనూ ఆశ, సందేహం. నిస్పృహ—అన్నీ కలిసిన ఏదోభావం...ఉద్యోగం దొరికేవరకూ దైన్యం. దొరగ్గానే ఉత్సాహం పుంజుకుని వాళ్ల వ్యక్తిత్వం ప్రకాశించటం ప్రారంభిస్తుంది. బాగుంది! అనుకున్నారు.

ఇప్పుడు శీనయ్య ఈ పని చేశాక ఎవర్ని చూసినా వీడు ఎలాంటివాడో? అనిపిస్తున్నది. ఒక మనిషికి రంగుటద్దాల్లోంచీ తప్ప ప్రపంచాన్ని చూడటానికి వీలుకాదేమిటి? ఆకలీ, దప్పీ, నిద్రావలెనే ధైర్యం, నిస్పృహ, బ్రతకటంలో తృప్తి, అసంతృప్తి అనే వాటిని అర్థం చేసుకోవచ్చును. కాని అసూయ, కుత్సితం, నిర్లక్ష్యం అనేవి అర్థం కావటంలేదు.

ఆలోచనా రహితంగా కిటికీ బయటకు చూస్తూ ఉండిపోయారు రామచంద్రయ్యగారు... ఏకాగ్రతతో చూస్తున్న ఆయన కళ్లముందు నేల తేజోమయమైనది. మట్టి ప్రాణాన్ని సంతరించుకొని చైతన్యపూర్ణమై వివిధాల లాస్యం చెయ్యనారంభించింది...

ప్రతి మట్టికణమూ ఒక మహా చైతన్యం. అంతా కలిసీ ఒకే చైతన్యం, ఒకే ప్రాణం, ఒకే తేజస్సు!

ఆ తేజస్సులో నుండీనే ఆవిర్భవిస్తున్నాయి వివిధాలైన రూపాలూ వింత ప్రాణులూనూ...

ఆ తేజో విలాసమే బారలు చాచుకున్న ప్రాణం వెల్లివిరుస్తున్న బాదంచెట్టు. దాని మరోరూపమే కునుకుతున్న లిల్లీమొక్క. అదే ముద్దమందారం. అదే కలుపుమొక్కలు...అవును, కలుపుమొక్కలు!

అన్నీ, అన్నీ. అదే!

ఆ వింతదర్శనం రామచంద్రయ్యగారి మనస్సుకు ప్రశాంతతనీ ఆహ్లాదాన్నీ కలిగించింది. భావనల్లం పనిచేసింది కాబోలు, నొప్పులన్నీ తగ్గిపోయి ప్రాణం సుఖంగా ఉన్నది. 'కాని...జీవితానికి బలాన్నిచ్చేవి ఆహ్లాదాన్ని కలిగించేవి కొన్ని. ఆ జీవిత పరమార్థాన్ని మరుగుపరచి సత్యాన్ని కుంటుపరచి నీరసపరచేవి కొన్ని' అనుకున్నారు నవ్వుకుంటూ.

'లిస్టులో నా పేరు రాలేదనుకో. అయినా యిచ్చేవోళ్ల యిష్టంగెందా. పోయిన తడవ యీ సీపరు పని వొచ్చినపుడు దెశయ్య గారికాడ రికమెండేసను జేయించిన...ఆ కాసింత సాయం జెయ్యటానికి ఆ దెశెయ్యగారింటో రెండేళ్ల మట్టీ మాయమ్మ సిల్లర మల్లర పనులన్నీ జేసిపెడతా వుంది. అదిగో ఆస్పటాల్లో యిప్పిత్త యిదిగో ఆపీసులో యిప్పిత్త అంటానే జరుపుకొచ్చినడు. ఆకరికి యీ కాలేజిలో యిప్పించిండు...ఈ తడవ ఆ సిన్నోళ్ల దెగ్గరికెందుకో, ఏకంగా పెద్దోళ్ల కాళ్లే అట్టుకుందావని అయ్యగారినే అడిగినా...పెడదిమట్టీ వూడవటం, తోటపని, హోటలునుంచి కాపీలు తెచ్చియ్యటం, ఏం పని జెప్పిన కాదనకుండ జేత్తన్నాగా. అయ్యగారికి మాత్తరం తెలవదా...ఏం జేత్తారో...' చెంచు రాముడు జకరయ్యకు చెప్పుకుంటున్నాడు.

రామచంద్రయ్యగారికి నవ్వొచ్చింది. ఇదివరలో వాడికి ఉద్యోగం రావటంలో దశరథరామయ్యగారి జోక్యం ఏమీ లేదు. లిస్టులో వాడి పేరు ఒచ్చింది. ఒచ్చిన వాళ్లలో చూచి తానే యిచ్చారు పని...

కాలింగ్‌బెల్ వినగానే చెంచురాముడి వాక్ప్రవాహం ఆగిపోయింది. ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళల్లో ఒకరికి ఉద్యోగం యిస్తున్నట్లు ఆర్డరు టైపు చేయించటానికి ఆఫీసుకు తీసుకెళ్ళాడు చెంచురాముడు ఉత్సాహంగా......

వెళ్తున్న చెంచురాముణ్ణి చూస్తూ 'ఆ కాగితంలో ఏముందో తెలిసినా వీడు యిట్లాగే ఉత్సాహంగానే తీసుకెళ్తాడు' అనుకున్నారు. అలా అనుకుంటే ఆయనకు చాల సంతోషం కలిగింది.

జీవితాన్ని గూర్చిన సత్యం, అనేక యుగాలనుంచీ మానవ జాతిని నశించిపోకుండా నడిపించుకు వస్తున్న జీవనధర్మం ఏదో వాడిలోనుంచీ తొంగి చూస్తున్నట్లనిపించింది.

చెంచురాముడు జకరయ్య కిచ్చిన ఉపన్యాసాల్లోని మరో భాగం గుర్తు కొచ్చింది...'పండక్కి ఏం అప్పచ్చులు చేశావ'ని అడిగిన జకరయ్యతో '...పండగేందయ్యా... రోజూ రెండు పూటల బువ్వతినటం పండగగాదా...అంతకంటె మనకి పండగేంది...బతకటమే పండగ అనేవాడు మా బాబు...' ఎందుకో ఆ మాటలూ, అవి పలికిన వాడి నవ్వే గొంతూ రామచంద్రయ్యగారి మనసులో నాటుకపొయ్యాయి....